క్లుప్తంగా

భద్రతా వారోత్సవాలు ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ భద్రత సూచనలు పాటిస్తూ సంస్థ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పాటుపడాలన్నారు. పారిశ్రామిక రంగంలో 85 శాతం ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులు పని చేసే ప్రదేశాల్లో పర్యవేక్షక ఇంజినీర్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎస్ఈలు సాంబశివరావు, కేవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కర్మాగారాల మేనేజర్ శేషాద్రి శేఖర్, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నెమలి హుండీ కానుకల ఆదాయం రూ. 10.22 లక్షలు



తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను దేవదాయ శాఖాధికారులు మంగళవారం లెక్కించారు. ఆలయంలోని 8 హుండీలలో గత 2 నెలల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.10 లక్షల 22 వేల 390 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ఎన్. సంధ్య తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ గన్నవరం తనిఖీదారు అనురాధ, సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు వివిధ అంశాల్లో వందకు పైగా ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో సైన్స్ ప్రయోగాలు చేసి ఆకట్టుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులను కరస్పాండెంట్ మురళీమోహన్ అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 132 మంది హాజరు



చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 144 మంది విద్యార్థులకు 132 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు.

రోడ్డుకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

చాట్రాయి: మండలంలోని చనుబండ–నరసింహారావుపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులను మంగళవారం ప్రారంభించారు. దుమ్ముతో ఇబ్బందులు శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్ వెట్‌మిక్చర్ ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

14న క్రైస్తవ సమ్మేళనం

నందిగామ టౌన్(నందిగామ రూరల్): క్రైస్తవులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకునేలా ముందుకు సాగాలని నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. పట్టణంలోని నూతన యెరూషలేము ప్రార్థనా మందిరంలో మంగళవారం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

కందిపప్పు కట్!

- మార్చి నెలకు కార్డుదారులకు పంపిణీ చేయని కందిపప్పు
- నియోజకవర్గంలో రేషన్‌కార్డులు 94,185
- కందిపప్పు సరఫరాకు ప్రభుత్వం ఎగనామం



నూజివీడు మండలంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

నూజివీడు: తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతి నెలా పంపిణీ చేసే సరుకుల్లో కూటమి ప్రభుత్వం కోత విధిస్తోంది. మార్చి నెలకు సంబంధించి రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యానికి తోడు పంచదారను మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకుంది. దీంతో పేదలు పప్పన్నానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. రేషన్‌షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పును మార్చినెలకు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 140

నూజివీడు నియోజకవర్గంలో కార్డుదారులకు మార్చి నెలకు సంబంధించి కందిపప్పు పంపిణీ కాలేదు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి కిలో రూ.130 నుంచి రూ.140 వరకు ఉంది. ప్రభుత్వ రేషన్‌షాపుల్లో కందిపప్పును కిలో రూ. 70 లకే ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. దీంతో ఎండీయూ వాహనాల వద్ద తెల్ల రేషన్‌కార్డుకు కిలో చొప్పున కందిపప్పును రాయితీ ధరకు అందించేవారు.

ఎన్నికలప్పుడు హామీలపై హామీలు

ఎన్నికల సమయంలో బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు గోధుమ పిండి, రాగి పిండి తదితర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు రాయితీపై అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలైనా ఇంత వరకు అదనపు సరుకులు ఏమో గాని, ఉన్న సరుకులనే ఇవ్వకుండా కోత విధించడం దారుణం. పౌరసరఫరాల శాఖ మంత్రికి కందిపప్పు, రేషన్ బియ్యం గోడౌన్లలో తనిఖీలు చేయడంలో ఉన్న శ్రద్ధ పేదలకు రేషన్ సరుకులను అందించే విషయంలో లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నూజివీడు నియోజకవర్గం వివరాలు		
మండలం	రేషన్ కార్డులు	అవసరమైన కందిపప్పు (కిలోల్లో)
ఆగిరిపల్లి	20,769	17,760
చాట్రాయి	17,331	15,088
ముసునూరు	18,515	15,099
నూజివీడు	23,922	20,905
నూజివీడు టౌన్	13,648	12,457
మొత్తం	94,185	81,309

నియోజకవర్గానికి 94.185 కిలోల కందిపప్పు అవసరం

నియోజకవర్గంలో 170 రేషన్ దుకాణాలు, 58 రేషన్ వాహనాలు ఉండగా 94,185 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుకు ఒక కిలో చొప్పున 94,185 కిలోల కందిపప్పు ప్రతి నెలా అవసరమవుతుంది. అధికారులు మాత్రం మొత్తం అవసరంలో 90 శాతం మాత్రమే అంటే నెలకు 80 వేల కిలోలకు మాత్రమే ఇండెంట్ పెడుతున్నారు. దానిని కూడా ఈనెల రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయకుండా ఎగ్గొట్టింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.130కి కందిపప్పును కొనుగోలు చేసే పరిస్థితి పేదలకు లేకపోవడంతో వారు ఈ నెల పప్పన్నానికి దూరం కానున్నారు. పేదలకు ప్రతి నెలా ఇచ్చే కిలో కందిపప్పును ఎగ్గొట్టడం దారుణమని పలువురు నాయకులు అన్నారు.

కందిపప్పు నిలిపివేత దారుణం



పేదలకు ఇచ్చే కందిపప్పును ప్రభుత్వం మార్చి నెలకు ఇవ్వకుండా నిలిపివేయడం దారుణం. సంక్షేమ పథకాలన్నింటినీ ఎగ్గొట్టిన ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పును నిలిపివేయడం సమంజసం కాదు. కందిపప్పుతో పాటు గోధుమలు, రాగి పిండి, ఇతర సరుకులను కూడా ఇవ్వాలి.

– నిమ్మగడ్డ నరసింహ, సీపీఐ నాయకుడు, నూజివీడు

పేదలకు అన్యాయం



రేషన్‌షాపుల ద్వారా రాయితీపై ఇచ్చే కందిపప్పును ప్రభుత్వం నిలిపివేయడం పేదలకు అన్యాయం చేసినట్లే. బయట షాపుల్లో కిలో కందిపప్పు కొనుగోలుకు రూ.140 వసూలు చేస్తున్నారు. అంత ధర పెట్టి పేదలు కొనుగోలు చేయలేని పరిస్థితి. వచ్చే నెల నుంచి కందిపప్పును ఆపకుండా రేషన్ షాపులకు సరఫరా చేయాలి.

– కంభాల దాసు, కాట్రేనిపాడు, ముసునూరు మండలం

కందిపప్పు ఈనెల రాలేదు

మార్చి నెలకు సంబంధించి కందిపప్పు రాకపోవడంతో కార్డుదారులకు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు సరఫరా చేస్తే అప్పుడు రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తాం. బియ్యం, పంచదార ప్రస్తుతానికి కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాం.

– జీ వెంకటేశ్వరరావు, పీడీఎస్ డీటీ, నూజివీడు

నెమలిలో ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలిలో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను మైలవరం ఏసీపీ ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. నెమలి దేవస్థానం ఈఓ సంధ్య, తిరువూరు సీఐ గిరిబాబు, గంపలగూడెం ఎస్ఐ శ్రీనులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి పోలీసు బందోబస్తు చేయాల్సిన ప్రదేశాలను గుర్తించారు. యాత్రికులకు బస్సులు ఎక్కే, దిగే స్థలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జూపూడి(ఇబ్రహీంపట్నం): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఏడీసీపీ జి.రామకృష్ణ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిమ్రా డెంటల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ఎదుటి వారికి కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించి, రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమావళిని ఉల్లంఘిస్తే నూతన చట్టం మేరకు జరిమానాలు విధిస్తామని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాహిత్య, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపు లాటరీ

నందిగామ టౌన్(నందిగామ రూరల్): ప్రభుత్వం గీతకులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు ఈ నెల 6న లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి కలెక్టర్ పర్యవేక్షణలో విజయవాడలో లాటరీ ప్రక్రియ నిర్వహించటం జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ



బలివేలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ముసునూరు: మహా శివరాత్రి ఉత్సవాల్లోనూ, అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు అభినందనీయమని సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ అన్నారు. బలివే పంచాయతీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం సచివాలయం వద్ద ఘనంగా సత్కరించి, నూతన వస్త్రాలను అందించారు. ఆలయ, ఉత్సవ ప్రాంగణం, తాత గుడి వీధి, గ్రామ ప్రధాన వీధులు, సచివాలయం, పాఠశాల ఏరియా, ఆలయానికి మూడు వైపులా ఉన్న రహదారులకు ఇరువైపులా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు ఏరి, చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లలో చెత్త శుద్ధి కేంద్రానికి తరలించడంలో వారి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ధర్మావతి, ఇతర కార్యదర్శులను అభినందించారు. కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే సంతోషకరమైన జీవనం

ఐసీడీఎస్ ఏలూరు పీడీ శారద



గొల్లపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఏలూరు పీడీ శారద

నూజివీడు: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని, అప్పుడే సంతోషకరమైన జీవితం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ ఏలూరు పీడీ పి.శారద అన్నారు. గొల్లపల్లిలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని, హక్కులపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు అనేక చట్టాలు రూపొందించి మహిళలకు, బాలికలకు రక్షణగా ఉంటున్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ద్వారా మహిళలను మరింత చైతన్యవంతులను చేసేందుకు ఐసీడీఎస్ కృషి చేస్తోందని చెప్పారు. డీసీపీఓ సూర్యచక్రవేణి, సీడీపీఓ కె.ధనలక్ష్మి, గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నజీమా, ఏలూరు ఏసీడీపీఓ సునీత, హెచ్‌వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డులోనే విద్యుత్ స్తంభం



సిమెంట్ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి కందులపాడు నుంచి గంగినేని మీదుగా తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వరకు ఉన్న 242వ నంబర్ రాష్ట్ర రహదారి విస్తరణ పనులు కొంతకాలంగా జరుగుతున్నాయి. ఈ రహదారిలో చెర్వుమాధవరం గ్రామంలోని 12వ కిలో మీటరు నుంచి 13.350 కిలోమీటరు వరకు 1.350 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ పనుల్లో భాగంగా రహదారిపై ఉన్న విద్యుత్ లైన్‌ను పక్కకి జరపకుండానే రోడ్డు నిర్మాణం చేశారు. దీనితో సిమెంట్ రోడ్డులో విద్యుత్ స్తంభం వింతగా దర్శనమిస్తోంది. ఇది కాంట్రాక్టరు, విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది. విద్యుత్ లైన్‌ను పక్కకు జరిపేందుకు విద్యుత్ శాఖకు కాంట్రాక్టరు డబ్బులు చెల్లించక పోవడం వల్లనే లైన్‌ను అలా వదిలేశారని తెలుస్తోంది. ఏది ఏమైనా విద్యుత్ స్తంభాన్ని అలానే ఉంచి రోడ్డు వేయడంతో గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తిరువూరురూరల్: రబీ సీజన్‌లో అధిక దిగుబడి సాధించేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. ముష్టికుంట్ల, చౌటపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొట్ట దశలో ఉన్న వరి పంటకు తెగుళ్ల రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పంటలు సాగు చేసే రైతులు విధిగా ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేయాలని, రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటివరకు 5,188 మంది రైతులకు సంబంధించిన 13,274 ఎకరాల్లో వేసిన పంటలు నమోదు చేశామని చెప్పారు.

రేషన్ షాపులో తనిఖీలు

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం రేషన్ షాపు 5లో మంగళవారం విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి తనిఖీలు చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఐదవ నంబర్ రేషన్ షాపులో తనిఖీ చేయగా 4.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. షాపు సీజ్ చేసి సరుకుని 10వ నంబర్ రేషన్ షాపునకు బదిలీ చేశామన్నారు. సదరు డీలర్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



కంచికచర్ల: పేద విద్యార్థులకు తమ సేవాసమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అరుంధతీయ సేవా సమితి కన్వీనర్ ముండ్లపాటి పోతరాజు అన్నారు. స్థానిక అరుంధతీ నగర్‌లో అరుంధతీయ సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, ప్యాడ్‌లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగ్గయ్యపేట కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ కే రమేష్ మాట్లాడుతూ త్వరలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలను బట్టీపట్టి చదవకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమితి నాయకులు వేల్పుల ప్రభాకర్, మాడుగుల వాసుబాబు, నెమలి వాసు, కొండూరు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్ నమోదు

నూజివీడు: ఫార్మర్స్ రిజిస్ట్రీ కార్యక్రమం ఈనెల 5న పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తామని వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ అయిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రాయితీ పథకాలు వర్తిసాయన్నారు. భూమి కలిగిన భూ యజమానులందరూ తమ భూముల వివరాలను నమోదు చేయించుకుని ఫార్మర్స్ రిజిస్ట్రీ నంబరు పొందాలని పేర్కొన్నారు. రాయితీపై ఇచ్చే విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పీఎం కిసాన్‌పథకం, సున్నా వడ్డీ రుణాలు, క్రాప్ ఇన్సూరెన్స్, వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, డ్రిప్ రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా ఈ నంబరు అవసరమని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి శ్రమ దినాలు

తిరువూరు: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే క్రీస్తు శ్రమల దినాలు బుధవారం ప్రారంభమవుతాయని తిరువూరు సహాయమాత విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జంగం విజయకుమార్ తెలిపారు. జపమాల ధరించిన దీక్షాపరులు నీలిరంగు లేదా తెల్ల దుస్తులు ధరించాలని, ప్రతి రోజూ బైబిల్ పఠనం, ధ్యానం చేయాలని, సాయంత్రం జపమాలతో జపించాలని, పది ఆజ్ఞలను, తిరుసభ కట్టడలను పాటించాలన్నారు. స్త్రీ, పురుషులందరూ ఈ దీక్ష తీసుకోవచ్చన్నారు.

12 నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 12 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ ఎన్. సంధ్య తెలిపారు. 14న స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణోత్సవ ఏర్పాట్లపై తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి అన్ని శాఖల అధికారులతో ఈ నెల 6న తిరువూరులో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన



ముసునూరు: లేగదూడలను మంచి, సురక్షితమైన యాజమాన్య పద్ధతుల్లో పెంచాలని జిల్లా పశుగణాభివృద్ధి ఉప సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేగ దూడల సంరక్షణలో పశు పోషకులు శ్రద్ధ వహించి, మంచి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉత్తమ లేగ దూడల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకురాలు హరిత, నూజివీడు ఉప సంచాలకుడు చంద్రశేఖరరావు, మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఆగిరిపల్లి: గ్యాస్ వినియోగం విషయంలో ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను పాటించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జగన్‌మోహన్ రావు అన్నారు. స్థానిక మేఘ గ్యాస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత అనేది జీవన విధానంలో ముఖ్య భాగం కావాలన్నారు. కార్యక్రమంలో అజిత్ సింగ్ నగర్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పుష్పలత, రిటైర్డ్ ఎంఈఓ ప్రసాద్, మేఘ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో జీవితాలు నాశనం

ఎక్సైజ్ సీఐ మస్తానయ్య



ఈదరలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆగిరిపల్లి: సారా వల్ల జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ సీఐ మస్తానయ్య అన్నారు. ఆగిరిపల్లి, అడవినెక్కలం, ఈదర గ్రామాలలో నవోదయం కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య మాట్లాడుతూ సారా తయారు చేయడం, అమ్మడం గానీ, రవాణా చేయడం గానీ చేయకూడదని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా సేవిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, ఈ మహమ్మారిని గ్రామాల నుంచి తరిమివేయాలన్నారు. ఎక్సైజ్ ఎస్ఐలు ఈశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయదారుల బైండోవర్

ముసునూరు: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా విక్రయాలు నిర్వహించిన నలుగురిని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ముసునూరుకు చెందిన అనగాని రాంబాబు, కంచర్ల గంగాధరరావు, పులిచర్ల నాగేశ్వరరావు, గొల్లపల్లి నరసమ్మలను మంగళవారం బైండోవర్ చేయగా, తహసీల్దార్ వారిని నేరాలకు పాల్పడవద్దని, మళ్లీ నేరాలు చేస్తే ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు రద్దవుతాయని, లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అక్రమంగా మద్యం, సారా విక్రయాలు నిర్వహిస్తే ఎక్సైజ్ శాఖాధికారులు దాడులు జరిపి కేసులు నమోదు చేస్తారని తెలిపారు.

ఆశ వర్కర్ల నిరసన



కొండపల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కొండపల్లి పీహెచ్‌సీ వద్ద పలువురు ఆశవర్కర్లు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఆశ వర్కర్లు మాట్లాడుతూ కొన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపినప్పటికి మిగిలిన డిమాండ్స్ అమలు నెరవేర్చలేదన్నారు. వీటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా గుర్తించాలన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, క్యాజువల్ లీవ్స్, మరణించిన వారికి మట్టి ఖర్చులు జీఓ రూపంలో విడుదల చేయాలని, సంక్షేమ పథకాలు, ఒంటరి మహిళ పింఛన్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 6న విజయవాడలో జరిగే ధర్నా విజయవంతం చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి పీహెచ్‌సీల ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షులు సులోచన, లక్ష్మీ, రూరల్ అధ్యక్షులు ప్రశాంతి, మార్గరేట్, మీనా, సునీత, వనజ, రమాదేవి, ఆశాలు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన

బూదవాడ(జగ్గయ్యపేట): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ నితిన్ పేర్కొన్నారు. గ్రామంలో సూర్యఘర్ బిజిలీ పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సోలార్‌రూఫ్ టాప్ వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకుని విద్యుత్‌ను విక్రయించుకోవచ్చని చెప్పారు. చిల్లకల్లు, ధర్మవరప్పాడు తండా గ్రామాలలో లబ్ధిదారులు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రంగారావు, ఏపీఎం వెంకటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.